సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



పౌర సేవలపై 'సమ్మె'ట

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. పౌష్టికాహారం, బోధన తదితర సేవలకు ఆటంకం ఏర్పడింది.

వివరాలు 8లో ▸



కారును ఢీ కొట్టిన డీసీఎం

డీసీఎం వాహనం కారుని ఢీ కొట్టిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 8లో ▸



పట్టణాలకు దీటుగా...

పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

డైట్ కళాశాల సందర్శన



నారాయణఖేడ్: కళాశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: స్థానిక డైట్ కళాశాలను శనివారం డీఈవో వెంకటేశ్వర్లు, మెదక్ డైట్ ప్రిన్సిపాల్ రమేశ్ సందర్శించారు. ప్రభుత్వం ఇటీవల ఖేడ్‌కు కళాశాల మంజూరు చేయగా అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వారు కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కళాశాల నిర్వహణకు గాను సూచనలు, సలహాలనిచ్చారు.

హాస్టల్ భవనంలోనూ..

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాల ఆవరణలో నిర్మించిన బాలికల నూతన హాస్టల్ భవనాన్ని డీఈఓ వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. త్వరలోనే హాస్టల్ భవనాన్ని ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇందులో భాగంగానే నిర్మాణం ఇతర వాటిని పరిశీలించారు. ఆయన వెంట మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు రమేశ్, నాగరాజు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సురేశ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్: నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్, ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 13 లోగా పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100లు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టు

పటాన్‌చెరు టౌన్: ఉమ్మడి మెదక్ జిల్లా.. అండర్ -14 క్రికెట్ బాలుర, అండర్ -17 బాలికల జట్ల ఎంపిక ప్రక్రియను శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ పూర్తి చేశారు. ఎంపికలో భాగంగా 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 16 మంది బాలికలను, 16 మంది బాలురను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ నర్సింహ, పీఈటీలు శ్రీనివాసగౌడ్, నాగరాజ్, శివకుమార్, రమేశ్, రాజాగౌడ్, రవి, కరుణాకర్, రామరాజు, సంతోష్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

యూనిట్‌తో ఆర్థిక వృద్ధి సాధించాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: అందరికీ విడతలవారీగా దళితబంధు పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి భరోసానిచ్చారు. శనివారం ఖేడ్ పట్టణ శివారులోని హెచ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రెండో విడత దళితబంధు లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీలు ఎవరూ అధైర్య పడకూడదని అర్హులకు పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వ్యాఖ్యానించారు. లబ్ధిదారులందరూ ఒకే రకమైన యూనిట్‌ను కాకుండా పండ్ల తోటలు వంటి లాభాపేక్షమైనవి కూడా ఎంపిక చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, జిల్లా ఈడీ రామాచారి, నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైబస అధ్యక్షుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే ఖేడ్ మండలం జుజాల్‌పూర్‌కు చెందిన రాజుకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.17,500 చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి డెంగీతో, అతని తల్లి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

చెత్తపై చింత వద్దు

> అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా. ప్రజలు, వ్యాపారులు కూడా తమ వంతుగా చెత్త ఎక్కడ పడితే అక్కడ పడవేయొద్దు. అప్పుడే అందరి సహకారంతో స్వచ్ఛ అమీన్‌పూర్ సుసాధ్యం. పట్టణంలో దోమల వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో ఫాగింగ్ చేస్తున్నాం. ప్రజలు తమ ఇంటిని, చుట్టుపక్కల పరిసరాల శుభ్రతకు పెద్దపీట వేయాలి. – మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి

- స్వచ్ఛ అమీన్‌పూర్‌గా తీర్చిదిద్దుతాం
- దోమల నివారణకు చర్యలు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి



సాక్షి ఫోన్ ఇన్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో సేకరణ పాయింట్ ఉండగా అక్కడ నుంచి పారిశుద్ధ్య కార్మికులు రోజూ జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌కు చెత్త తరలిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ అన్నారు. శనివారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌కు వివిధ కాలనీల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

◆ డంప్‌యార్డ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.
– కిరణ్, సెంతస్ గ్రీన్‌పార్క్ కాలనీ

కమిషనర్ : మెయిన్ డంప్ యార్డ్‌కు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పది రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది. చెత్తను జవహర్‌నగర్‌కు రోజూ తరలిస్తాం. ఇప్పుడున్న సమస్య అప్పుడు ఉండదు.

◆ బీరంగూడ కమాన్ నుంచి కిష్టారెడ్డిపేట్ గుండా వచ్చే రహదారి మధ్యలో ప్లాంటేషన్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. ఆ సందుల గుండా కుక్కలు రోడ్డుపైకి వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
– వీరేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్, నవ్య ల్యాండ్ మార్క్

కమిషనర్ : కుక్కల సంఖ్య పెరగకుండా చర్యలు చేపడుతున్నాం. అలాగే మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తాం.

◆ పద్మావతి స్కూల్ నుంచి నరేంద్ర కాలనీకి వెళ్లే దారి బురదతో నిండి ఉంది. ఆపై డ్రైనేజీ సమస్య కూడా నెలకొంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.
– రామకృష్ణ యాదవ్, నరేంద్ర కాలనీ

కమిషనర్ : సంబంధిత ఏఈతో మాట్లాడతాం. వీలైనంత త్వరగా మరమ్మతులు చేయిస్తాం.

◆ ప్రభుత్వ పాఠశాలలో రోజు శానిటేషన్ చేయాలి.
– బలరాం, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు

కమిషనర్: రోజూ ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య సిబ్బంది హాజరై పరిసరాలను శుభ్రం చేసిన ఫొటోలు గ్రూపులో షేర్ చేస్తున్నారు. రోజు ప్రభుత్వ పాఠశాలల వద్ద శానిటేషన్ పనులు జరుగుతున్నాయి.

◆ వర్షాల కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అందులో నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరుగుతున్నాయి. అలాగే చెత్త సేకరించే సిబ్బంది అదనపు డబ్బులు అడుగుతున్నారు. చెత్త రిక్షా వారు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు.
– నరసింహారెడ్డి, ◆ బీరంగూడ భ్రమరాంబిక నగర్, శ్రీనివాస్‌రావు, ఎస్ఎస్ఎల్ కాలనీ

కమిషనర్ : దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే మున్సిపల్ పరిధిలో చెత్త సేకరించే ఆటో నిర్వాహకులు ప్రతినెలా 100 రూపాయలు సాధారణ చార్జీలు వసూలు చేస్తారు. అదనపు వసూళ్లకు పాల్పడుతున్న విషయం మా దృష్టికి రాలేదు. అలాంటివి ఉంటే చర్యలు తీసుకుంటాం.

> వర్షం వస్తే డ్రైనేజీ నీరు అపార్ట్‌మెంట్ లోపలికి వస్తున్నాయి.
> – సుమన, నారాయణరెడ్డి కాలనీ
>
> కమిషనర్: సిబ్బందిని పంపి సమస్యకు గల కారణాలు తెలుసుకొని పరిష్కరిస్తాం.



ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

◆ డంప్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. – మౌనిక, దీప్తి, జీఎస్ చక్రవర్తి, ప్రణీత్ కాలనీ, అమీన్‌పూర్

కమిషనర్: అది డంప్ యార్డ్ కాదు చెత్త సేకరణ పాయింట్. చెత్తను ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తరలిస్తున్నాం. వాహనాలు సేకరణ పాయింట్‌కు వచ్చేందుకు రోడ్డు వేయిస్తున్నాం. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

◆ వర్షం కురిసిన సమయంలో డంప్‌యార్డ్ నుంచి నల్లటి నీరు కాలనీలోకి వస్తోంది. అవి దుర్వాసన వెదజల్లుతున్నాయి. – మహేశ్, ప్రణీత్, ప్రణవ్

కమిషనర్: డంప్‌యార్డ్ సేకరణ పాయింట్ వద్ద షెడ్డు నిర్మిస్తాం. 15 రోజుల్లో క్లియర్ చేస్తాం.

◆ డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించండి.
– గిరీశ్, పీఎస్ఆర్ కాలనీ

కమిషనర్ : లైన్ ఇన్‌స్పెక్టర్‌ను పంపిస్తాం. లీకేజీని పరిశీలించి సిబ్బందితో మరమ్మతు చేయిస్తారు.

◆ రహదారి నుంచి నవ్య కాలనీకి చేరుకొనే రోడ్డు అధ్వానంగా తయారైంది. – సైదిరెడ్డి, నవ్య హోమ్స్

కమిషనర్ : ఏఈతో చర్చించి మరమ్మతులు చేయిస్తాం.

◆ వందన పూరికాలనీ ఇసుక బావి వద్ద చెత్త పడవేయకుండా చూడాలి. – బలరాం, బీజేపీ నాయకులు

కమిషనర్: మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి ఎప్పటికప్పుడు చెత్త తొలగించే విధంగా చూస్తాం. స్థానికులతో మాట్లాడతాం.

◆ డ్రైనేజీ సమస్య ఉంది కొత్త లైన్ వేయాలి.
– సుప్రియ, నారాయణరెడ్డి కాలనీ

కమిషనర్ : సంబంధిత ఇంజినీర్‌ను పంపుతాం.

◆ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు ఉప్పొంగుతోంది.
– రాజా, గ్రీన్ ఫీల్డ్ సనాతన్ హోమ్స్

కమిషనర్: పారిశుద్ధ్య సిబ్బంది వెంటనే చేరుకుని మురుగు పైకి రాకుండా చర్యలు తీసుకుంటారు.

◆ చెత్త సేకరించే కార్మికులు సక్రమంగా రావడం లేదు. అలాగే డ్రైనేజీ నీరు అపార్ట్‌మెంట్‌లోకి చేరుతోంది.
– ప్రకాశ్‌రావు, నారాయణరెడ్డి కాలనీ

కమిషనర్: చెత్త సేకరించే కార్మికుడు రోజు విధంగా చూస్తాం. అలాగే అసలు సమస్య ఎక్కడుందో తెలుసుకొని తదుపరి పరిష్కారిస్తారు.

◆ రోడ్డుపై డ్రైనేజీ లీక్ వల్ల ఇబ్బంది పడుతున్నాం.
– పవన్ కుమార్, లాలాబాయి కాలనీ

కమిషనర్ : పారిశుద్ధ్య సిబ్బంది అక్కడికి చేరుకొని లీక్‌ను నివారిస్తారు.

◆ రోడ్డు మధ్యలో పైప్‌లైన్ వేశారు. నడవడానికి వీలు లేకుండా ఉంది. ఆపై మట్టి వేయగా అక్కడ నరకం కనిపిస్తోంది.
– కిరణ్ కుమార్‌రెడ్డి, హెచ్ఎంటీ, ఆర్టీసీ కాలనీ

కమిషనర్ : సిబ్బందిని పంపి మట్టిని తొలగింపజేస్తాం.

◆ పీఎస్ఆర్‌కాలనీలో రోడ్డుపై చెత్త ఊడ్చి కుప్ప చేస్తున్నారే గానీ తరలించడం లేదు. రోడ్డు నంబర్ 6కు సిబ్బంది రావడం లేదు.
– విజయ్, పీఎస్ఆర్ కాలనీ

కమిషనర్: తొలగించేలా శానిటేషన్ వర్కర్లకు సూచిస్తాం. రోడ్డు నంబర్ ఆరుకు కూడా వస్తారు.

◆ శాంతి శ్రీనగర్ కాలనీలో డ్రైన్ వేయండి
– రాంబాబు, స్థానికుడు

కమిషనర్: నిధుల లభ్యతను బట్టి డ్రైన్ నిర్మాణం చేపడతాం.



లడ్డూను దక్కించుకున్న బాలకృష్ణారెడ్డి

లడ్డూ అధరహో

జిన్నారం(పటాన్‌చెరు): వినాయకుడి లడ్డూను కొత్వాల్ బాలకృష్ణారెడ్డి రూ.12.54లక్షలకు దక్కించుకున్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఓల్డ్ విలేజ్ గణేశ్ ప్రతిమను నిమజ్జనం శనివారం గావించారు. అంతకుముందు లడ్డూకు వేలం వేయగా పై ధరకు ఆయన సొంతం చేసుకున్నారు. అలాగే స్వామివారి హిరణ్య మాలను తూపల్లి భాస్కర్‌రెడ్డి రూ. 3 లక్షలకు దక్కించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అనికుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలో అన్నదానం నిర్వహించారు.

ఈ పదేళ్లలో ప్రగతి పరుగులు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ



ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): సొంతింటి కలను సాకారం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం పథకాలను అమలు చేస్తున్నారని, 65 ఏళ్లుగా రాష్ట్రంలో జరగని అభివృద్ధి కేవలం పదేళ్లలో వేగంగా జరుగుతోందని వెల్లడించారు. శనివారం జిన్నారం మండలంలోని మాదారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 3 వేల మందికి గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని వీరందరూ ఈ పథకానికి అర్హత పొందారన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలను మహిళలకు అందించటం సంతోషంగా ఉందన్నారు. నిరంతర ప్రక్రియగా ఈ పథకం కొనసాగుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పథకాలను అందించేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. సొంతింటి కలను సాకారం చేసేందుకు డబుల్ బెడ్ రూం పథకంతోపాటు నిరుపేదలకు స్థలాలను కూడా అందిస్తున్నామని చెప్పారు. గృహలక్ష్మి కింద రూ.3లక్షలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సర్కారు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



మేళాలో ప్రదర్శించిన వస్తువులు

హస్తకళ.. అద్భుతహ..

200లకు పైగా వస్తువుల ప్రదర్శన



సంగారెడ్డి మున్సిపాలిటీ : కళాభారతి హస్తకళ మెగా మేళాను పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేశారు. ఇందులో పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, వరంగల్, వెంకటగిరి, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, బెడ్‌షీట్స్, టవల్స్ వంటి అనేక రకాల చేనేత వస్త్రాలను ప్రదర్శించారు. వాటితోపాటు కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్ టాయిస్, హైదరాబాద్ మంచి ముత్యాలు, మైసూర్ రోజ్వుడ్, సహరాన్పూర్ వుడ్ కార్వింగ్, వరంగల్ లెదర్ బ్యాగ్‌లు, బంజార ఎంబ్రాయిడరీ, బెంగాల్ జ్యూట్ బ్యాగ్స్ వంటి మరెన్నో ప్రపంచ ప్రసిద్ధి చెందిన 200లకుపైగా వస్తువులను ఈ మేళాలో ప్రదర్శన గావించారు. కాగా, వాటిని కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల వారు పోటెత్తారు. ఈ మేళా అక్టోబర్ 23వ వరకు కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

వంద శాతం పంట రుణాలు

- రెండుమూడు రోజుల్లోగా పూర్తి చేయాలి
- బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం



సంగారెడ్డి టౌన్ : జిల్లాలో అర్హత ఉన్న ప్రతి రైతుకు పంట రుణం అందాలని కలెక్టర్ శరత్ అన్నారు. శనివారం రుణమాఫీ, పంట రుణాల పురోగతిపై వ్యవసాయ శాఖ అధికారులు, ఎల్‌డీఎం, వివిధ బ్యాకుల కంట్రోలింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో లోన్ మాఫీ జరిగిన రైతులందరికీ వంద శాతం కొత్త పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ రెండు, మూడురోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 80,857 మందికి 471.71 కోట్ల రూపాయల రుణమాఫీ జరిగిందన్నారు. దీంట్లో 70 శాతం మంది రైతులకు కొత్త లోన్‌లు అందించామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. మిగతా వారికి కూడా వెంటనే అందించాలని కలెక్టర్ తెలిపారు. డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ఫెయిల్యూర్ అయిన వారి వివరాలను ఆయా బ్యాంకర్లు లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు అందించాలని ఆదేశించారు. బ్యాంకుల, బ్రాంచీల, రైతులవారీగా ఎంతమందికి ఎంత మొత్తం మాఫీ అయిందన్న వివరాలు అందించాలని సూచించారు. పంట రుణాలు ఇచ్చిన జాబితా, రైతుకు సంబంధించిన వివరాలు, ఎంత లోన్ ఇచ్చామన్న సమాచారం వ్యవసాయ శాఖ ఏఈఓలకు అందించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు.

సామాన్యులే లక్ష్యంగా సైబర్ నేరాలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషీ

సిద్దిపేటకమాన్: యువకులు, సామాన్యులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు, డ్రగ్ మాఫియా రెచ్చిపోతున్నారని, అవగాహన లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషీ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట విపంచి కళానిలయంలో శనివారం డ్రగ్ అబ్యూస్, సైబర్ నేరాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన న్యాయమూర్తి ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సామ్ కోషీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు పంపించే అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఇంటర్‌నెట్‌ను తక్కువగా వినియోగించాలని సూచించారు.

ఓర్పునకు భూమియే నిదర్శనం

చాగంటి కోటేశ్వరరావు



సిద్దిపేటజోన్: మనిషి ఓర్పునకు భూమి ఒక పెద్ద సాక్షి అని, కష్టాలను తట్టుకొని నిలబడిన వారు జీవితంలో అన్ని సాధిస్తారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో మానవీయ విలువలపై ప్రవచనాలు చేశారు. మనిషి దయా గుణం కలిగి ఉండాలని, అప్పుడే భగవంతుని కృపకు పాత్రులు అవుతారన్నారు. ఎదుటివారి తప్పులు లెక్కించడం మాని, అందరి కోసం బతకడం నేర్చుకోవాలని అన్నారు. కష్టంలో ఉన్నవారిని ఆదుకోవాలని, సహనం, ఓర్పు అనేవి గొప్ప లక్షణాలన్నారు. మానవీయ విలువలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ప్రేరణ అని మంత్రి హరీశ్ అన్నారు. శనివారం రంగనాయక సాగర్ నీటిపారుదల అతిథి గృహంలో చాగంటితో మంత్రి ముచ్చటించారు.

'నీలం' బలప్రదర్శన



పటాన్‌చెరులో ఎస్ఎంఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ శనివారం బలప్రదర్శన చేశారు. యువసేన ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ చౌక్ నుంచి బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయం వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా బరిలో నిలుస్తానని, మీరు ఆశీర్వదిస్తే చట్టసభల్లో బీసీల తరపున గొంతెత్తుతానని చెప్పారు. బీసీ ఉద్యమాన్ని ముందుకు సాగిస్తున్నానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. తనను ఎమ్మెల్యే గా చూడాలనే సంకల్పంతో వేలాది మంది మద్దతుగా తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్రకు శ్రీకారం చుడుతానని ప్రకటించారు.

– పటాన్‌చెరు టౌన్

వైద్యరంగానికి పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్



పీహెచ్‌సీ ఉప కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

వట్‌పల్లి(అందోల్): ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని అన్నసాగర్, నాదులాపూర్ గ్రామాల్లో సీహెచ్‌సీ ఉప కేంద్రాల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఎర్రారం, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్న ఆకాంక్షతో సీఎం కేసీఆర్ ఆరోగ్యశాఖలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రతి గ్రామంలో పల్లె దావాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం

నారాయణఖేడ్: పట్టణ శివారులోని రాయిపల్లి రోడ్‌లో ఓ మద్యం దుకాణం ఎదుట రోడ్డు పక్కన పొదల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం సాయంత్రం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని స్థానికులు తెలిపారు.

రాయచెరువులో...

నర్సాపూర్‌రూరల్: స్థానిక రాయరావు చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సీఐ షేక్‌లాల్ మదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతదేహంపై తెల్లని బనియన్, పర్పుల్ రంగు షర్ట్, నలుపురంగు ప్యాంట్, నల్లని బెల్టు ఉన్నాయని, 32 ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. సమాచారం కోసం పోలీస్ స్టేషన్ (8712657940, 8712657941)లో సంప్రదించాలని కోరారు.

లడ్డూ రూ.2.85లక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్ విలాస్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగాయి. శనివారం సాయంత్రం లడ్డూ వేలం నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలంలో పోలీస్ సందీప్ రెడ్డి రూ.2 లక్షల 85 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

కోమటిచెర్వు అద్భుతం

సిద్దిపేటజోన్: కోమటిచెర్వు అద్భుతంగా ఉందని, ఒక పర్యాటక కేంద్రంగా ఉందని రాష్ట్ర గీతా కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన కోమటిచెర్వు సందర్శించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్ తరహాలో సిద్దిపేట కోమటిచెర్వు అందంగా మారిందన్నారు. ఆయన వెంట జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు బాలకిషన్ గౌడ్ ఉన్నారు.

పౌర సేవలపై 'సమ్మె'ట

20 రోజులుగా ఆందోళనలు

- 5 ప్రాజెక్టుల్లో 1,504 కేంద్రాలు మూత
- ఫలించని ప్రత్యామ్నాయ చర్యలు
- కేంద్రాల్లో నిలిచిన సేవలు
- స్పందనలేని ప్రభుత్వం: అంగన్‌వాడీలు



నారాయణఖేడ్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

నారాయణఖేడ్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కృషి అంతా ఇంతా కాదు. వారు చేసేసేవలు ఎనలేనివి. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, బోధించడంలో అంగన్‌వాడీల అనుబంధం చెప్పలేనిది. స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్య పాత్ర పోషించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టారు. 20 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు రోజువారీగా అందించే పౌష్టికాహారం, బోధన తదితర సేవలకు ఆటంకం ఏర్పడింది. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశించినా పూర్తిస్థాయిలో అది సాధ్యంకా ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట, పటాన్‌చెరు, సదాశివపేటల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఉన్నాయి. ఈ ప్రజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 99,634, గర్భిణులు 11,698, బాలింతలు 6,851 ఉన్నారు. ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేసోంది. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు రెండుసార్లు పౌష్టికాహారం పంపిణీ, 3–5 ఏళ్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఒకపూట పౌష్టికాహారంతో కూడిన భోజనం వండి పెడుతున్నారు. రోజూ కోడిగుడ్డు, పాలు, ఒకపూట సంపూర్ణ భోజనం ఆయా కేంద్రాల్లో అందజేస్తారు. అలాగే చిన్నారులకు బోధన కొనసాగుతోంది. కానీ వారంతా సమ్మెబాట పట్టడంతో పౌష్టికాహార సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో గ్రామాలు, బస్తీల్లోని పేదలు, చిన్నారులు నష్టపోతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు..

అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆర్పీలు, గ్రామాల్లో వీవోఏలు, కార్యదర్శులకు కేంద్రాల బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వెంటనే పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు. కాని క్షేత్రాస్థాయిలో మాత్రం అమలు కావడంలేదు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీలు అక్కడక్కడా కొన్ని కేంద్రాల తాళాలు తీసినా కేంద్రాల నిర్వహణ మాత్రం సాగడంలేదు.

ఇదీ ప్రభుత్వ వాదన..

ప్రభుత్వం మాత్రం పదవీ విరమణ వయసు 65 ఏళ్లు, విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు, ఆసరా పింఛన్ ఇస్తామని పేర్కొంటుంది. ఉద్యోగాల క్రమబద్ధీకరణ అంశం కేంద్ర ప్రభుత్వంతో ముడిపడి ఉందని, వేతన సవరణ మాత్రం ఇతర ఉద్యోగులకు పెంచిన సందర్భాల్లో అంగన్‌వాడీలకూ పెంచుతున్నాం అని పేర్కొంటుంది.

"సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన ఆగదు



ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుంది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలి. ఈఎఫ్, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలి. తమ పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లు ఉంచాలి. టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలి.

– వీణాకుమారీ, అంగన్‌వాడీ టీచర్, శెల్గిర

స్పందన లేదు..



20 రోజులకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కన్పించడం లేదు. 2018లో టీచర్లు, ఆయాలకు కేంద్రం పెంచిన వేతనం అమలు చేయాలి.

– నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్, నారాయణఖేడ్"

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయడంతోపాటు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతోపాటు వేసవిలో పాఠశాలలతో సమానంగా సెలవులు ఇవ్వాలి. ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు పిల్లలకు రూ.5, గర్భిణులు, బాలింతలకు రూ.10కి పెంచాలి. పదవీ విమరణ వయస్సును 60 ఏళ్లకు చేయాలి. పదవీ విరమణ సమయంలో టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు

ఇవీ డిమాండ్లు..

రూ.5లక్షలు చెల్లించాలి. గత నిబంధనల ప్రకారం ఎస్ఎస్‌సీ అర్హత ఉన్న హెల్పర్లకు పదోన్నతుల సౌకర్యం కల్పించాలి. సీనియార్టీని బట్టి వేతనంలో వ్యత్యాసం కల్పిస్తూ ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలి. బీఎల్‌వో డ్యూటీలు రద్దు చేయాలి, ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను చేయించకూడదు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా గుర్తిస్తూ ప్రకటించిన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలి. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలి. పక్కాభవనాలు, మౌలిక వసతులను కల్పించాలి. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనం అంగన్‌వాడీ టీచర్లకు రూ.1,500, ఆయాలకు రూ.750లు, మినీ వర్కర్లకు రూ.1.250లు రాష్ట్ర ప్రభుత్వం ఏరియర్స్‌తో సహా చెల్లించాలి. ఇలా మొత్తం 28 డిమాండ్లను పరిష్కరించాలంటూ సమ్మెలో కొనసాగుతున్నారు.

జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు



పవన్‌కుమార్



ఎండీ అమన్

గజ్వేల్‌రూరల్: మంజీరా కాన్సెప్ట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పవన్, మహతి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎండీ.అమన్ జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మంజీరా పాఠశాల కరస్పాండెంట్ అంబదాస్ ప్రిన్సిపాల్ రజితతో కలిసి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.పవన్ కుమార్ ఆగస్టు 26, 27 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే మహతి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎండీ.అమన్ జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ గోపీనాథ్‌శర్మ, ప్రిన్సిపల్ షబానా తెలిపారు. విద్యార్థులు అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిరిడీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఆయా కార్యక్రమాల్లో పీఈటీ ఏసురాజు, ఉపాధ్యాయులు శశిధరశర్మ, పీఈటీ విజయ్‌కుమార్, శ్రీకుమార్, తిరుపతి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి



ఆశ్రిత్

సిద్దిపేటజోన్: జిల్లా బాస్కెట్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థి ఆశ్రిత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సంగారెడ్డిలో శనివారం జరిగిన ఎంపిక పోటీల్లో ఆశ్రిత్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి వంశీ ర్షం వ్యక్తం చేశారు.

3న సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు రైలు

- కాళేశ్వరంతో రైతుల్లో సంతోషం
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజల ఆరు దశాబ్దాల కల కొద్ది గంటల్లో నెరవేరబోతుందని, 3న మధ్యాహ్నం మూడు గంటలకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు రైలు పోతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆత్మీయ సమ్మేళనం, క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ సందర్భంగా మాట్లాడారు. భవిష్యత్తులో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగుళూరుకు రైల్వే సౌకర్యం రానుందని స్పష్టం చేశారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన మంచి పనులు, సేవలు చిరస్థాయిగా ఉంటాయన్నారు. జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలో పని చేసే టీచర్లకు తన సొంత ఖర్చులతో ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రారంభం..

సిద్దిపేటరూరల్: కాళేశ్వరం ద్వారా రైతులు సంవత్సరానికి రెండు పంటలు పండించుకుంటూ ఎంతో సంతోషంగా ఉంటున్నారని రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని రావురూకుల, చింతమడక గ్రామాలో శనివారం ఆయన పలు ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెంకటేశ్వర ఆలయ నిర్మాణం పనులు, పురిగిరి క్షత్రియ(పెరిక) సంఘ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నేడు గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అరఎకరం స్థలంలో పెరిక భవనాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. తరువాత చింతమడక గ్రామంలో రూ.10 కోట్లతో నిర్మించిన బీసీ బాలికల గురుకుల పాఠశాల భవనం, నెమలి వనం అర్బన్ పార్క్‌ను ప్రారంభించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్లు మల్లికార్జున్, ట్రెస్మా అధ్యక్షుడు మల్లారెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, సుడా చైర్మెన్ రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం రేట్ తగ్గించేలా పనిచేయాలి

డీజీపీ అంజనీకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ అంజనీకుమార్

సిద్దిపేటకమాన్: పారదర్శకంగా విధులు నిర్వహించాలని, నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. అడిషనల్ డీజీపీ శిఖగోయల్, డీఐజీ రమేష్‌నాయుడు, సీపీ శ్వేతతో కలిసి ఆయన శనివారం పోలీసు కమిషనర్ కార్యాలయం, పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ..కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఆరు, ఏడు నెలల్లో 600 మంది పోలీసు అధికారులకు సీఐ నుంచి డీఎస్పీ, డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు పదోన్నతులు ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పోలీసు స్టేషన్‌లలో సబ్ డివిజన్ నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 750 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయని, ఏ స్టేషన్‌లోనైనా పోలీస్ వారు ఏ చిన్న తప్పు చేసినా మొత్తం డిపార్ట్‌మెంట్‌కు చెడ్డపేరు వస్తుందన్నారు. క్రైం రేట్ తగ్గించే విధంగా పనిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పోలీసుశాఖకు అధునాతన వాహనాలను అందించినట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆవరణ ఆహ్లాదకరంగా ఉందని అభినందించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పోలీసు కన్వెన్షన్ సెంటర్‌ను అద్భుతంగా నిర్మించడం జరిగిందన్నారు. డీజీపీకి సీపీ శ్వేత జిల్లా భౌగోళిక పరిస్థితులు, నియోజకవర్గాల పరిధి, బార్డర్ పీఎస్‌లు, జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రాజెక్టులు తదితర అంశాల గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, రాంచద్రరావు, సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రమేష్, సతీష్, చంద్రశేఖర్, సీఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనపై విచారణ

దుబ్బాకటౌన్: గ్యాస్ సిలండర్ పేలడంతో ఇల్లు ధ్వంసమయిన ఘటన దుబ్బాకలో జరిగింది. సంఘటన స్థలాన్ని శనివారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారిణి తనూజ సంబంధిత హెచ్‌పీసీఎల్ అధికారి శర్మ, అగ్ని మాపకశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితుడు శ్రీనివాస్‌గౌడ్‌ను పరామర్శించారు. ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్ సిలండర్ పేలిన ఘటనలో ఇల్లు ధ్వంసం అయిందని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కుంబాల రవిందర్, కార్యదర్శి ఆస ముత్యం, రాజిరెడ్డి, పర్శరాములు, అజయ్ తదితరులు ఉన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

అప్రమత్తంగా ఉండాలి: ఎఫ్ఆర్‌వో వికాస్



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌ఓ వికాస్

పెద్దశంకరంపేట(మెదక్): మండలం పరిధిలోని టెంకటి గ్రామ శివారులో చిరుతపులి కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి సమయంలో ఈడిగి నారాయణ అనే రైతు పొలం వద్ద కట్టేసి ఉంచిన మేకపై చిరుతపులి దాడిచేసి చంపింది. ఉదయాన్ని ఆ విషయాన్ని గమనించిన రైతు ఆందోళచెంది ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. స్థానిక ఎఫ్ఆర్‌వో వికాస్, సెక్షన్ అధికారి నర్సింలు సంఘటనా స్థలానికి వెళ్లి చిరుత పాద ముద్రలను సేకరించారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని వారు భరోసా ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు తొందరగా చిరుతపులిని బంధించి రైతులను కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ కోరారు.

కారును ఢీ కొట్టిన డీసీఎం

ఐదుగురుకి తీవ్ర గాయాలు



ప్రమాదం జరిగిన చోటును పరిశీలిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: డీసీఎం వాహనం కారుని ఢీ కొట్టిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం.. మెహిదీపట్నం నానాల్ నగర్‌కు చెందిన వృద్ధులు ఫరీద్, వజిత్, అబ్దుల్ ఖాదర్, ఖాజా ఉద్దీన్, వీరు మహమ్మద్, అబ్దుల్ మనన్ తమ కారులో శనివారం భానూర్ ఆయుర్వేదిక్ ఆసుపత్రికి శనివారం వస్తున్నారు. ఈ క్రమంలో వారు నందిగామ ఓ వెంచర్ సమీపంలోకి వస్తుండగా శంకర్‌పల్లి వైపు నుంచి వస్తున్న డీసీఎం వాహనం ఢీ కొట్టింది. కారులో బెలూన్ ఓపెన్ కావడంతో ఐదుగురు గాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స కోసం అమీన్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న మొహమ్మద్ అబ్దుల్ మనన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు రెడ్డిపల్లి

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు రెడ్డిపల్లి విద్యార్థినులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

నర్సాపూర్ రూరల్: స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్ 14 వాలీబాల్ జట్టుకు రెడ్డిపల్లి జెడ్పీ స్కూల్ బాలికలు ఆస్మా, నికీషా, యామిని, వినీల, వాణి, కల్యాణి, పూజ ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో వారు మొదటి స్థానంలో నిలిచారు. వారిని హెచ్‌ఎం తారా సింగ్, పీ ఈ టీ ప్రదీప్ రెడ్డి, వెంకటేష్ ఇతర ఉపాధ్యాయులు వారు అభినందించారు.

13 నుంచి జోనల్ స్థాయి క్రీడోత్సవాలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో అక్టోబర్ 13 నుంచి 16 వరకు 9వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ భీమయ్య తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి క్రీడల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోనల్ స్థాయిలో నిర్వహించే ఈ క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్రీడామైదానాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ పీడీలు వాసు శాంతి కుమార్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, పందరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీస్‌యాక్ట్

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో ఆదివారం నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, పబ్లిక్ సమావేశాలు నిర్వహించవద్దని చెప్పారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడిగా అఖిల్ రాథోడ్



నియామక పత్రం అందుకుంటున్న అఖిల్ రాథోడ్

ఝరాసంగం(జహీరాబాద్): గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడిగా అఖిల్ రాథోడ్ నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి..



శ్రీకాంత్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): రెండువేర్వేలు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. గణేష్ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా మండల పరిధిలోని చెప్యాల యువకుడు నీట మునిగి చనిపోయాడు. దీంతో నిమజ్జన శోభాయాత్ర విషాదంగా మారింది. అప్పటి వరకు సంతోషంగా కేరింతలు కొడుతూ వెళ్లిన యువకుడు విగత జీవిగా మారడంతో గ్రామంలో విషాదచ్చాయలు అలుముకున్నాయి. అతడి భార్య, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. చెప్యాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ (28) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య వనజ, ఏడు నెలల కుమారుడు ఉన్నారు. గ్రామంలో గల్లీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నవరాత్రోత్సవాల ముగింపును పురస్కరించుకునినిర్వహించారు. ఉత్సవాలల్లో భాగంగా శుక్రవారం రాత్రి గణేష్ నిమజ్జన శోభాయాత్రలో శ్రీకాంత్ పాల్గొన్నాడు. ఆ రాత్రి గ్రామ శివారులోని కుమ్మరి కుంటలో నిజ్జనం చేస్తున్న క్రమంలో శ్రీకాంత్ గల్లంతయ్యాడు. దీంతో యూత్ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేక పోవడంతో వెనుదిరిగారు. శనివారం తెలవారు జామున మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్ళ సహాయంలో శ్రీకాంత్ మృత దేహాన్ని వెలికి తీశారు. శ్రీకాంత్ భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మృతి చెందిన శ్రీకాంత్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు శనివారం పరామర్శించి ఓదార్చారు. ఆర్థిక సాయం అందించారు.



కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మరమ్మతులు చేస్తుండగా..



బేతయ్య మృతదేహం

టేక్మాల్(మెదక్): మరమ్మతుల కోసం కుంటలో దిగిన ఒక విద్యుత్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలం లోని దనూర శివారులో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ దయానంద్ కథనం ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన భూషణంగారి బేతయ్య(52) కోరంపల్లిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఈశ్వరుని కుంటలో పిడార్ లైన్ వైరు తెగి పడింది. శనివారం ఉదయం తోటి ఉద్యోగితో కలిసి చెరువులో పడిన వైరును తీయడానికి బేతయ్య ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికితీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బేతయ్య భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ కొని..



పెండ్యాల ప్రశాంత్ (ఫైల్‌ఫోటో)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన పెండ్యాల ప్రశాంత్(28) రేగొండ గ్రామానికి చెందిన నూనే శ్రీకాంత్ పందిల్ల గ్రామంలో ఎదురెదురుగా వచ్చి బైకులతో ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ మృతి చెందాడు. శ్రీకాంత్ తీవ్రంగా గాయపడడంతో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.